



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన నత్తనడక



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అప్పన్నపల్లిలో క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న అధికారులు

- అధికారుల బృందాలను పెంచితేనే దరఖాస్తు పరిశీలనలో పురోగతి
- దరఖాస్తుదారుల్లో కనిపించని ఉత్సాహం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 726 మాత్రమే రెగ్యులరైజ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 25: కొండలా పేరుకుపోయిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం మూడు నెలల సమయం విధించింది. రోజూ వంద దరఖాస్తులకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలంటున్న అధికారులు అందుకు తగిన బృందాలను నియమించకపోవడం వల్ల సర్వే నత్తనడకన సాగుతోంది. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన బృందాలు తక్కువగా ఉండటం వల్ల ఒక్కో మునిసిపాలిటీలో రోజంతా పని చేసినా.. 20 నుంచి 30కి మించి దరఖాస్తులను క్లియర్ చేయలేకపోతున్నారు. పాలమూరు పురపాలికలో 31 వేల దరకాస్తులు ఉన్నాయి. ఇక్కడ కేవలం రెండు బృందాలను మాత్రమే నియమించారు. ఈ బృందాలు నాలుగైదు రోజులుగా కేవలం 125 దరఖాస్తులకు మాత్రమే ప్రొసిడింగ్స్ ఇచ్చాయి. ఇలా చేస్తే ఏడాదైనా దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కాదని తెలుస్తోంది. దరఖాస్తులు ఎక్కువగా ఉన్న మునిసిపాలిటీలలో ఐదు నుంచి ఆరు బృందాలను ఏర్పాటు చేస్తే కొంత పురోగతి కనిపించనుంది. ఉమ్మడి పాలమూరులోని తొమ్మిది మునిసిపాలిటీలలో ఇంకా ప్రక్రియ ప్రారంభం కాలేదని గణాంకాలు చెబుతున్నాయి. 10 మునిసిపాలిటీలలో మాత్రం 726 మంది మాత్రమే సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, ఫీజు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ అనుమతి పత్రాలను పొందారు.

ముందుకురాని దరఖాస్తుదారులు

అనుమతులు లేని ప్లాట్లు, లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో దరఖాస్తులు పురపాలికలకు బారులు తీరారు. ఉమ్మడి పాలమూరులోని అన్ని పురపాలికల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. నాలుగేళ్ళుగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఎప్పుడు అవకాశం ఇస్తారా? అని గగ్గోలు పెట్టిన దరఖాస్తుదారులు తీరా ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ముందుకు రావడం లేదు. అధికారులు వెంటపడుతున్నా చాలామంది ముఖం చాటేస్తున్నారు. ముందుగా రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవడానికి చూయించిన ఉత్సాహం ఇప్పుడు ఫీజు చెల్లించి అనుమతులు పొందడానికి మాత్రం చూపడం లేదు. దరఖాస్తు చేసుకున్న సమయంలో అందులో నమోదు చేసిన ఫోన్ నంబర్, ప్లాట్‌లకు సంబంధించిన పత్రాలు, కచ్చ లేఅవుట్‌లు తీసుకుని అధికారుల బృందం ఫీల్డ్‌మీదికి వెళ్తోంది. కొందరి వద్ద సరైన డాక్యుమెంట్‌లు లకపోగా, మరికొందరు ఇప్పుడు తమకు అవసరం లేదని, డబ్బులు లేవని చెబుతున్నారు. దీంతో దరఖాస్తుల ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. సరైన దరఖాస్తులు లేని వారు సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా రెగ్యులరైజ్ చేయనున్నారు.

రూ.3 కోట్ల ఆదాయం

డీటీసీపీ లేఅవుట్ లేకుండా వెంచర్లు చేసి, విక్రయించిన ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు 2020 ఆగస్టు 26న అప్పటి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దాంతో ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో 1.94 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన మేర ముందుకు కదలడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు మునిసిపాలిటీలలోనే కాస్త బెటర్‌గా ఆర్‌ఆర్‌ఎస్ ప్రక్రియ సాగుతున్నట్లు తెలుస్తోంది. పాలమూరు పురపాలికలో 125, భూత్పూర్‌లో 196, జడ్చర్లలో 165 దరఖాస్తులకు అనుమతులిచ్చారు. ఇక మిగతా జిల్లాల్లో వనపర్తిలో 118, ఆత్మకూర్‌లో 51, వడ్డేపల్లిలో 19, కొత్తకోటలో 16, మక్తల్‌లో 11, కోస్గిలో ఒకటి, పెబ్బేరులో ఎనిమిది దరఖాస్తులకే అనుమతులిచ్చారు. వీటిద్వారా రూ.మూడు కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది.

వెబ్‌సైట్‌లో ఫీజు వివరాలు

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఎంత చెల్లించాలో అధికారులు వెబ్‌లింక్‌ను విడుదల చేశారు. లింక్ ఓపెన్ చేస్తే ప్లాట్ చదరపు గజాలు, 2020 ఆగస్టు 26 నాటికి మార్కెట్ విలువ, ప్లాట్ కొనుగోలు చేసిన సమయంలో మార్కెట్ విలువ అందులో నమోదు చేస్తే ఎంత ఫీజు చెల్లించాలో తెలుస్తుంది.

నయనం ప్రధానం


- నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు
- నేత్రదానంతో ఇంకొకరికి వెలుగు



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 25: సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మనిషి శరీరంలో అన్ని అవయవాల కంటే కంటికి ఉన్న ప్రత్యేకత వేరు. ప్రపంచాన్ని చూడాలన్నా.. అందాన్ని ఆస్వాదించాలన్నా.. కళ్లతోనే సాధ్యమవుతుంది. అలాంటి కళ్లు లేకపోతే జీవితం సాఫీగా సాగించడం కష్టం. అలాంటి కంటి చూపును ప్రసాదించే వారిని దేవుడిగా భావిస్తారు. తాను చనిపోయిన తర్వాత కూడా ఇంకొకరికి చూపును అందించాలని కొంత మంది అనుకుంటున్నారు. నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం చేసిన వారి కుటుంబీకుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

రెడ్‌క్రాస్ ద్వారా సేకరణ

ప్రస్తుత సమాజంలో ఒక్కొక్కరు ఒక్కో కారణంతో కంటి చూపును కోల్పోతున్నారు. అందులో కొందరు కంటి సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు కార్నియా అంధత్వంతో చూపు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి దృష్టిని ప్రసాదించేందుకు ఉన్న ఒకే ఒక్క మార్గం నేత్రదానం. ఆ నేత్రదానం చేసేందుకు కొంత మంది ముందుకు వస్తున్నారు. వారు సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తూ, తాము చనిపోయిన తర్వాత కూడా తమ కళ్ల ద్వారా ఇంకొకరికి చూపును ప్రసాదించవచ్చని బతికుండగానే నేత్రదానం చేసేందుకు అంగీకరిస్తున్నారు. అలాంటి వారు చనిపోతే వారి నుంచి కళ్లను సేకరించి, చూపు లేనివారికి కంటి చూపును అందిస్తున్నారు. జిల్లాలో అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా కళ్లను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ ద్వారానే ఎక్కువగా కళ్ల సేకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.



169 మంది నుంచి కళ్ల సేకరణ

రెడ్‌క్రాస్ ద్వారా గత కొన్నేళ్లుగా నేత్రదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 169 మంది నుంచి నేత్రాలు సేకరించాము. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి చెందిన ఓ టెక్నీషియన్‌ను పిలిపించి ఈ నేత్రాలు సేకరిస్తాము. నేత్రదానం చేయాలనుకునే వారు ముందుగానే మాతో రిజిస్టర్ చేయించుకుంటారు. లేదంటే నేత్రదానం చేయాలని అనుకునే వారు మాకు ఫోన్ చేస్తే మేమే వెళ్లి నేత్రాలు సేకరిస్తాము. ప్రజలు నేత్రదానం చేయడానికి ముందుకు రావాలి. ఇంకొకరికి చూపును ప్రసాదించాలి. ఎవరైనా నేత్రాలు దానం చేయాలనుకుంటే 9666900900 నంబర్‌కు చేయండి.

- లయన్ నటరాజ్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్

చనిపోయినా బతికి ఉంటుందని..



శాంతమ్మ (ఫైల్)

నా భార్య పుట్టి శాంతమ్మ కూరగాయలు తీసుకొని మా కొడుకుతో కలిసి 2023 నవంబరు ఆరున ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై కుక్క అడ్డం వచ్చి కిందపడ్డారు. దీంతో నా భార్యకు పెద్ద గాయమైంది. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రికి తీసుకెళ్లాం. వైద్యులు బ్రెయిన్ డెడ్ అని చెప్పారు. నా భార్య చనిపోయినా వేరేవారి రూపంలో బతికి ఉంటుందని ఆమె కళ్లు, గుండె, లివర్, కిడ్నీలు దా నం చేశాము. నవంబరు 10న ఆమె చనిపోయింది. నా భార్య అవయవాలు దానం చేయడం వలన ఆమె చనిపోయిందనే భావన మాలో లేదు. జీవితాంతం వేరే వారి రూపంలో ఆమె బతికే ఉంటుంది.

- శంకరయ్య, గాదిర్యాల్, మహ్మదాబాద్ మండలం

అమ్మ కోరిక మేరకు దానం చేశాము



సద్దె బాలమ్మ(ఫైల్)

మా నాన్న ఎమ్మెల్యేగా పని చేశారు. మా కుటుంబం నిత్యం సమాజ సేవలోనే ఉండేది. ఆయన స్ఫూర్తితో మా అమ్మ సద్దె బాలమ్మ కూడా సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో ఉండేది. చనిపోయిన తర్వాత తన కళ్లను దానం చేయాలని ప్రతీసారి చెబుతుండేది. ఆమె కోరిక మేరకు కళ్లను దానం చేశాం. మా అమ్మ గత ఏడాది జూలై 31న అనారోగ్యంతో చనిపోయింది. వెంటనే రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌కు ఫోన్ చేసి చెప్పాము. ఆయనే ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి టెక్నీషియన్‌ను పంపించి, కళ్లను సేకరించారు. నేత్రదానం మహాదానం. ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా నేత్రదానం చేయడానికి ముందుకు రావాలి. కంటిచూపు లేక ఎంతో మంది బాధపడుతున్నారు. వారికి చూపునివ్వాలంటే ప్రతీ ఒక్కరు నేత్రదానం చేయాలి.

- నాగేందర్, బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు, మహబూబ్‌నగర్.

నాన్న స్ఫూర్తితో మేము కూడా..



పాపయ్య(ఫైల్)

మా నాన్న పాపయ్యకు సేవాభావం ఎక్కువ. ఎవరికైనా సహాయం చేయాలంటే ముందుండే వారు. తాను చనిపోయిన తర్వాత తన కళ్లను దానం చేయాలని మాకు చెప్పారు. ఆయన గత ఏడాది జూలై 27న క్యాన్సర్‌తో చనిపోయారు. చనిపోయిన తర్వాత రెడ్‌క్రాస్‌కు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి మా నాన్న కళ్లను సేకరించారు. నాన్న స్ఫూర్తితో మా కుటుంబ సభ్యులమంతా కళ్లను దానం చేయాలని నిర్ణయించుకొని రిజిష్టర్ చేసుకున్నాము. వేరే వాళ్ల కళ్లతో మా నాన్న బతికే ఉన్నారన్న సంతృప్తి మాకు ఉంది. ప్రతీ ఒక్కరు నేత్రదానం చేయాలి.

- అరుణ, మహబూబ్‌నగర్

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

- బడ్జెట్‌లో రూ.364 కోట్లు కేటాయింపు
- క్రీడలను నిర్లక్ష్యం చేసిన గత బీఆర్‌ఎస్ సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి
- రాష్ట్ర స్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, బడ్జెట్‌లో రూ.364 కోట్లు కేటాయించిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్టేడియం మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-16 బాల,బాలికల బాస్కెట్ బాల్ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. వివిధ జిల్లా క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మాజీ సీఎం కేసీఆర్ క్రీడలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. సీఎం ఫుట్‌బాల్ క్రీడాకారుడు కాబట్టి క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి వర్ధమాన క్రీడాకారులను పోత్సహిస్తామన్నారు. ఒలింపిక్, ఏషియన్స్‌కు ఎదిగేలా క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని క్రీడా పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ పార్లమెంట్ పరిధిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని జితేందర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ పోటీలు ఏర్పాటు చేసి, మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి రావడంలో క్రీడా సంఘాలు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసూరుల్లా హైదర్ మహ్మద్, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎంఐఎం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జాబేర్‌బిన్ సయీద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హాదీ, బాస్కెట్‌బాల్ సంఘం ఉపాధ్యాక్షుడు సుబహాన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలీద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.



తలపడుతున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు

మహబూబ్‌నగర్ బాలికల జట్టు శుభారంభం

- నేడు ఫైనల్స్



తలపడుతున్న వికారాబాద్, మెదక్ బాలికల జట్లు

బాస్కెట్ బాల్ టోర్నీ మొదటి రోజు ఆదివారం హోరాహోరీగా సాగింది. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు రంగారెడ్డిపై 18-26 తేడాతో, హైదరాబాద్‌పై 9-21 తేడాతో ఓడిపోయింది. మహబూబాబాద్ జట్టు 29-23 తేడాతో సూర్యపేటపై, నిజామాబాద్ 24-2 తేడాతో మంచిర్యాలపై, జగిత్యాల 16-2 తేడాతో కరీంనగర్‌పై, కామారెడ్డి 31-4 తేడాతో మంచిర్యాలపై, హైదరాబాద్ జట్టు 37-24 తేడాతో రంగారెడ్డి గెలుపొందాయి.

బాలికల విభాగంలో..

బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 23-8 తేడాతో హన్మకొండపై గెలిచి శుభారంభం చేసింది. వికారాబాద్ జట్టు 41-14 తేడాతో మెదక్‌పై, ఖమ్మం 20-6 తేడాతో మంచిర్యాలపై, హన్మంకొండ 17-10 తేడాతో మహబూబాబాద్‌పై, జగిత్యాల 13-7 తేడాతో కామారెడ్డిపై, నల్గొండ 21-11 తేడాతో మెదక్‌పై, నిజామాబాద్ 27-10 తేడాతో మంచిర్యాలపై, మహబూబబాద్ 10-0 తేడాతో సూర్యపేటపై, కరీంనగర్ 14-10 తేడాతో హైదరాబాద్‌పై, మేడ్చల్ జట్టు 44-0 తేడాతో కామారెడ్డిపై విజయం సాధించాయి. సోమవారం ఫైనల్స్ నిర్వహించనున్నారు.

నల్లమలలో 33 పెద్ద పులులు

- మరో ఐదు అధికంగా ఉండొచ్చని ఫారెస్టు అధికారుల అంచనా
- వన్యప్రాణుల సంఖ్యపై మరో ఐదు రోజుల్లో అధికారిక వివరాలు



నల్లమల అడవిలో సీసీ కెమెరాలో నమోదైన పులులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సంతానోత్పత్తి సమయంలో ప్రత్యేక నిబంధనలు అమలు చేయడంతో పాటు పులుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ క్రమంలో నల్లమల అభయారణ్యంలో పులుల సంఖ్య 33కు చేరిన చేరింది. ఈ మేరకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు అధికారులతో పాటు నేషనల్ టైగర్ రిజర్వ్‌కు సంబంధించిన ప్రత్యేక అధికారులు నివేదికలు సమర్పించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి ఏటా నవంబరు నుంచి జూన్ వరకు అధికారులు ప్రత్యేక సర్వే చేపడతారు. పులుల గణనకు సంబంధించి నేషనల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు సూచనల మేరకు నల్లమల అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ ఫుటేజీల ఆధారంగా ఏ ప్రాంతంలో ఎన్ని పులులు సంచరిస్తున్నాయో లెక్కలు నిర్ధారిస్తారు. పులుల ఫుటేజీలను డెహ్రాడూన్‌లోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఫారెస్టు ప్రత్యేక విభాగానికి పంపించి, శాస్త్రీయమైన ఆధారాలను తీసుకుంటారు. తాజా గణాంకాల ప్రకారం నల్లమలలో 33 పులులు ఉన్నాయి. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలోనూ అడవి ఉండటంతో పులులు అటూ ఇటూ సంచరిస్తున్నట్లు గమనించారు. 2023 గణాంకాల ప్రకారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో 21 పులులు ఉన్నట్లు గుర్తించగా, ప్రస్తుతం 26 పులులు,

26 పులులు.. ఏడు పిల్లలు..

ఏడు పిల్లలు ఉన్నట్లు నిర్ధారించారు. ఐదు పులులు నాగార్జునసాగర్, శ్రీశైలం అటవీ ప్రాంతం మధ్య సంచరిస్తున్నట్లు నివేదికలో పొందుపర్చారు. అయితే నల్లమల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు, పులుల సంరక్షణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర వివరణ కోరినట్లు తెలిసింది. మంగళవారంలోగా నల్లమల అటవీ ప్రాంతంతోపాటు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు గురించి కీలక సమాచారం అందే అవకాశాలు ఉన్నాయి. టైగర్ రిజర్వ్ ఫారెస్టులో చెంచులను మైదాన ప్రాంతాలకు తరలించే అంశంలో కూడా విస్తృతమైన అభిప్రాయాలు పరిగణనలోకి రానున్నాయి.

తీజ్‌మార్

- అచ్చంపేటలో ఘనంగా వేడుకలు
- నృత్యం చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



గిరిజన సంప్రదాయ తలపాగాలతో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట, ఆగస్టు 25: గిరిజనుల తీజ్ వేడుకలు చివరి రోజు ఆదివారం అచ్చంపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గిరిజన భవన్ వద్ద ఈనెల 16న వేడుకలను ప్రారంభించారు. చివరి రోజు ఊరేగింపు సందర్భంగా పట్టణ ప్రధాన రహదారి మొత్తం గిరిజనులతో నిండిపోయింది. పట్టణంతో పాటు ఇతర తండాల నుంచి గిరిజనులు వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, పురుషులు ధరించిన తలపాగాలు ఆకట్టుకున్నాయి. యువతులు తీజ్ బుట్టలను ఎత్తుకొని, డీజే దరువులకు నృత్యం చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్ తలపాగాలు ధరించి గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా వేడుకల్లో పాల్గొన్నారు.

స్వల్ప లాఠీచార్జి

ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే వంశీకష్ణను పార్టీ కార్యకర్తలు గిరిజన భవన్ నుంచి భుజాలపై ఎత్తుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును కూడా ఆ పార్టీ కార్యకర్తలు భుజాలపై ఎత్తుకున్నారు. ఇద్దరూ ఒకే చోట తారస పడటంతో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. గొడవ జరుగుతుందని పోలీసులు కలుజేసుకొని ఇరు వర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. ర్యాలీ బస్టాండ్ వద్దకు రాగానే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. అల్లర్లు చెల రేగకుండా ర్యాలీ త్వరగా ముగిసేలా చూశారు.



ఇరు పార్టీల కార్యకర్తలను చెదురగొడుతున్న పోలీసులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోస్గి, ఆగస్టు 25: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి బల్దియా పరిధిలోని సంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గారెల రవి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధికై హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి తాళం విరగ గొట్టి దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు చుట్టుపక్కల వారు గుర్తించి రవికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రవి స్వ గ్రామానికి వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం సహయంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో తులం బంగారం, రూ.ఐదు వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

కేఎల్ఐ చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 25 : కేఎల్ఐ చివరి ఆయకట్టుకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్‌లు పసుల శ్రీలత, పసుల రాజేష్‌రెడ్డి, పలువురు నాయకత్వంతో కలిసి కేఎల్ఐ డీ-61కాల్వను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. కాల్వ 98శాతం పూర్తైందని చె రువును నింపడానికి పొలాల మధ్య నుంచి తీసిన కా ల్వకు సీసీని నిర్మించేలా చూడాలని ఎమ్మెల్యేను మాజీ సర్పంచ్‌లు శ్రీలత, రాజేష్‌రెడ్డి, రైతులు కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కాల్వకు సీసీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నా యకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తె లిపారు. కేఎల్ఐ పరిధిలో రై తులకు పెండింగ్‌లో ఉన్న భూనష్ట పరిహారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తోటపల్లి వద్ద కేఎల్ఐ కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

పూర్తికాని కాలువలు

- అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్
- మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను తొలగించని అధికారులు
- పెండింగ్ పనులను పూర్తి చేయాలని రైతుల ఆవేదన


వెంకటాపురం శివారులో అసంపూర్తిగా వదిలేసిన పిల్లకాలువ పనులు

వడ్డేపల్లి, ఆగస్టు 25 : నెట్టెంపాడు ప్రాజెక్టు కింద కాలువల ద్వారా నీరు వస్తే పంట పండించు కుందామని అన్నదాతలు ఆశించారు. పంట పొలాల్లో పిల్ల కాలువలు తీసిన కాంట్రాక్టర్ అలాగే వదిలి వేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువల వెంట బాటలు వదిలితే పొలాలకు బాగుం టుందని, పండిన పంటలు మార్కెట్‌కు తరలిం చేందుకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండ వని భావించారు. అందుకు భిన్నంగా ప్రస్తుత పరిస్థి తులు ఉన్నాయి. గద్వాల జిల్లా వడ్డేపల్లి మ ండల పరిధిలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో అంత ర్రాష్ట్ర రహదారి పక్కన కల్వర్టు నిర్మాణం పూర్తి అయింది. కాగా, కల్వర్టు పూర్తి అయినప్పటికీ మిషన్ భగీరథ పైప్‌లైన్ కాల్వకు అడ్డంగా ఉండటంతో నీరు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సం బంధిత మిషన్ భగీరథ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని వారంటున్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టు 99, 100 ప్యాకేజీల కింద అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి మండలాల్లో పెద్ద కాలువలతో పాటు పిల్ల కాలువలను తవ్వేందుకు రైతుల నుంచి విలువైన భూములను సేకరించారు. పదేళ్ల క్రితం భూములు స్వాధీనం చేసుకున్నటికీ నేటి వరకు పనులు పూర్తికాక నీరు రాకపోవడంతో అన్నదాతల ఎదురు చూపులు తప్పడం లేదు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఉన్నతాధికా రులు స్పందించి అసంపూర్తిగా ఉన్న కాలువల పను లను పూర్తి చేయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా 99, 100 ప్యాకేజీ పనులు

నెట్టెంపాడు ప్రాజెక్టు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న 99, 100 ప్యాకేజీ కింద చేపట్టిన కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో పొలాలకు నీరు రాకపోగా దారులు మూసుకు పోయా యి. లక్షల విలువ చేసే భూములను వేల రూపాల యలకు కోల్పోయినా ఫలితం లేదని రైతులు వాపో తు న్నారు. ప్రస్తుతం ఒక ఎకరా రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకు విలువ ఉంటుందని అప్పట్లో కేవలం రూ.99వేలకు ఎకరం ప్రభుత్వానికి అప్పగించాలమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు పోయినా కాలువల పనులు పూర్తికాక నీరు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



వెంకటాపురం స్టేజీ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారి కాల్వపై కల్వ ర్టు నిర్మాణం పూర్తి అయినా మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించక పోవడంతో నీరు రావడం లేదు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించు కోవడం లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు కూడా విన్నవించాము. ఆరు సంవత్సరాలు గడుస్తున్నా కాలువ నిర్మాణం పనులు పూర్తికాలేదు.

- కుమ్మరి ఉరుకుంద, రైతు

పొలం ఇచ్చినా ఫలితం లేదు



కాలువ నిర్మాణానికి పొలం ఇచ్చినా నీరు పారక ఫలితం లేకపోయింది. ఎకరా పొలం ప్రభుత్వానికి రూ.90 వేలకు అప్పగించాం. ప్రస్తుతం పొలం విలువ రూ.20ల క్షల నుంచి రూ.50లక్షల దాకా పలుకుతుంది. మేము నష్టపరిహారం ఇవ్వా లని కోరడం లేదు. మా భూములు ఇవ్వాలని అడుగటం లేదు. ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు నీరు ఇస్తే బాగుంటుంది.

- రవి, రైతు

కోటమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

రాజాపూర్, ఆగస్టు 25 : మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం నుంచి సీతారామ లక్ష్మణ, కోటమైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచకం మంత్రం జరి పారు. ఈ సందర్భంగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నేడు నూతన విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమం జరుపనున్నట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, వెంకటయ్య గౌడ్, శేఖర్‌రెడ్డి, నారాయణ గౌడ్, రవికుమార్, గంగాధర్, హరీష్, శ్రీనివాస్ గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ దేవత బోనాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 25 : జడ్చర్ల మునిసిపాలిటీలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం సమీపంలోని బంగారు మైసమ్మ దేవత బోనాల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కావేరమ్మపేట నుంచి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని భారీ ఊరేగింపుతో దేవాలయం వరకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బంగారు మైసమ్మ దేవత బోనాల సందర్భంగా దేవాలయంలో అమ్మవారికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. మునిసిపల్ కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నరేందర్, పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

ముమ్మరంగా మార్కండేయ లిఫ్ట్ పనులు



మార్కండేయ లిఫ్ట్ వద్ద ముమ్మరంగా కొనసాగుతున్న ప్యానల్ బోర్డు ఫిటింగ్ పనులు

బిజినేపల్లి, ఆగస్టు 25 : కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా గతేడాది ప్రారంభించిన మార్కండేయ లిఫ్ట్ పనుల్లో పెండింగ్‌లో ఉన్న ప్యానల్ బోర్డు ఫిటింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 10న గుత్తేదారులు తీసుకొచ్చిన మోటర్లను ప్రారంభించే ప్యానల్ బోర్డులను శాశ్వతంగా ఫిట్టింగ్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేస్తున్నారు. వారం పది రోజుల్లో పనులు పూర్తి చేసి మోటార్లకు ప్యానల్ బోర్డులను అనుసంధానం చేసి వాటి ద్వారా పంపింగ్ చేపట్టి నీటిని గంగారం చెరువు, మార్కండేయ చెరువు, కీమ్యాతండా చెరువులతో పాటు ఇతర నీటి కుంటలను నింపి రైతులకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. మార్కండేయ ద్వారా నీటి విడుదల జరిగితే మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, గంగారం, పోలేపల్లి, లట్టుపల్లి గ్రామాలతో పాటు 15 తండాల రైతులకు సాగునీటితో పాటు తాగునీటి సమస్యల నుంచి శాశ్వతంగా విముక్తి లభిస్తుంది.

కుక్కల దాడిలో మేకలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

ఊర్కొండ, ఆగస్టు 25: కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారి తన వ్యవసాయ భూమిలో ఉన్న షెడ్డులో శనివారం రాత్రి మేకలను ఉంచి రావడం జరిగిందని అన్నారు. ఆదివారం తెల్లవారుజామున వెళ్లి చూడగా షెడ్డు చుట్టూ భద్రత కోసం జాలి చుట్టి ఉన్న కుక్కలు కింది నుంచి భూమి (నేల)ను తవ్వి కుక్కలు లోనికి వెళ్లి మేకలపై దాడి చేయగా 13 మేకలు మృతి చెందాయని అన్నారు. దాంతో సుమారుగా లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా తనకు ఆదుకోవాలని, అదేవిధంగా కుక్కల బారి నుంచి తమ పెంపుడు పశువులను కాపాడాలని పేర్కొన్నారు.

చౌదర్‌పల్లిలో విషాదం



పట్టాభి (ఫైల్)

వంగూరు, ఆగస్టు 25: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన జోగు పట్టాభి(43) ఆదివారం గుండెపోటు తో మృతి చెందాడు. పట్టాభికి జ్వరం రావడంతో భార్య బస్సులో కల్వకుర్తికి తీసుకెళ్లింది. కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టాభి బస్సు దిగుతుండగానే కుప్పకూలి పడిపోయి అక్కడే మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. భార్య శోభ కళ్ల ఎదుటే భర్త ప్రాణం వదలడంతో తట్టుకోలేక కన్నీటి పర్యంతమైంది. భర్త మృతదేహంపై పడి భార్య రోదిస్తున్న తీరు గ్రామస్థులను కలచి వేసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇసుక ట్రాకర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత

రాజాపూర్, ఆగస్టు 25 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కే.రవి తెలిపారు. మండలంలోని రాయపల్లి గ్రామంలోని దుందుభీ వాగులో ఆదివారం ఉదయం సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తయారు చేసి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను పక్కా సమాచారంతో గస్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుల్ గౌస్‌లు పట్టుకున్నారు. ఉదయం 11 గంటలకు ఐదు ట్రాక్టర్లలో కృత్రిమ ఇసుకను తరలిస్తుండగా, అనుమతి పత్రాలు అడగడంతో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పట్టుబడిన వాహనాలను, ఎక్స్‌కవేటర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేసే వారిపై, వాహనాలపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 25 : నేడు కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఎంపిక జరుగుతుందని జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.విజేందర్ యాదవ్, డాక్టర్ సోలపోగుల స్వాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 19,20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ అథ్లెటిక్స్ ప్రధాన స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ సౌత్‌జోన్ 20సంవత్సరాలలోపు, బాలబాలికలు, అండర్-18, అండర్-14, బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగబోతున్నాయని, దీనిని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణ సమీపంలో నిర్వహించే ఎంపిక పోటీలకు అర్హతగల వారు అధిక సంఖ్యలో హాజరవ్వాలని వారు పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ ఉదయం 9 గంటను నుంచి సాయంత్రం దాకా కొనసాగుతుందని నిర్వహకులు వివరించారు.

న్యాయం చేయాలంటూ సెల్ టవరెక్కిన వ్యక్తి



టవర్‌పై నిలబడి ఉన్న రాంచందర్

కోస్గి, ఆగస్టు 25 : వారసత్వంగా తనకు రావలసిన భూమిని కుటుంబసభ్యులే తనకు దక్కనివ్వడం లేదంటూ ఓ వ్యక్తి సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. ఈ సంఘటన ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఆదివారం జరిగింది. కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన రాంచందర్‌గౌడ్ తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని కుటుంబ సభ్యులు తనకు దక్కనివ్వడం లేదంటూ ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలోని సెల్ టవర్‌పైకి ఎక్కాడు. ఆయన ఇలా టవర్‌పైకి ఎక్కడం మూడవ సారి కావడంతో అధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో తనంతట తానే టవర్ దిగి వెళ్లిపోయాడు.

మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసిన ఏపీకే ఫైల్

- రూ.95800 గయాబ్

జడ్చర్ల, ఆగస్టు 25 : పిల్లలు ఆడుకుంటూ మొబైల్‌లో ఏపికె ఫైల్ డౌన్‌లోడ్ చేయడంతో ఖాతాలో ఉన్న రూ.95800 సైబర్ నేరగాళ్లు తస్కరించిన సంఘటన జడ్చర్ల మునిసిపాలిటీలో చోటు చేసుకుంది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మునిసిపాలిటీలోని భవానీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న అంగన్‌వాడీ టీచర్ సభావత్ కౌసల్య తన ఫోన్‌ను ఏప్రిల్ 6న పిల్లలకు ఇచ్చింది. చిన్నారులకు తెలియక ఏపికె ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశారు. విడతలవారీగా రూ.95వేల800 ఏప్రిల్ 6వ, 7వ తేదీలలో సైబర్ నేరగాళ్లు గుర్తుతెలియని అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఖాతాలో ఉన్న డబ్బులు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో చూసుకున్న కౌసల్య తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లుగా గుర్తించి, వెంటనే 1930 నెంబరుకు ఫిర్యాదు చేసింది. కాగా కౌసల్యకు సంబంధించిన రూ.95వేల రూపాయలు సైబర్ క్రైం శాఖ ఫ్రీజ్ చేయించినట్లుగా తెలిసింది. ఈ సంఘటనపై ఆదివారం బాధితురాలు కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వరదొచ్చినా ఒడ్డునే లాంచి

- **సోమశిల కృష్ణానదిలో లాంచి ప్రయాణం సాగేనా?**
- **ప్రయాణంపై ఆంక్షలు**
- **టికెట్‌పై 30 శాతం షేర్ కావాలంటున్న అటవీశాఖ**
- **విముఖత చూపుతున్న తెలంగాణ టూరిజం కార్పొరేషన్**
- **అన్ని ఉన్నా పర్యాటకులకు అందని లాంచి ప్రయాణం**

కొల్లాపూర్, ఆగస్టు 25: మొక్కాల్సిన గుడులు ఎక్కాల్సిన కొండలు.. చూడాల్సిన నిర్మాణాలు సేద తీరాల్సిన విడిది కేంద్రాలు.. ఆస్వాదించాల్సిన రుచులు.. అబ్బుర పరడాల్సిన ప్రకృతి అందాలు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిసరాల్లో సోమశిల కృష్ణానది పరివాహక ప్రాంతంలో పర్యాటక ప్రేమికుల్ని కట్టిపడేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వరుసగా కురిసిన భారీ వర్షాలకు ఏరులై పారి వచ్చిన వరద నీటితో కృష్ణానది నిండుకుండలా కళకళలాడుతున్నది. అయినా రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఏసీ లాంచి కృష్ణానది ఒడ్డున నిలిచిపోయింది. సోమశిల నుంచి శ్రీశైలం వరకు నదిలో లాంచి ప్రయాణం చేయాలనుకున్న పర్యాటకులకు నిరాశే మిగిలింది. ప్రతి ఏడాది కృష్ణా నదికి వరదొచ్చిన వెనువెంటనే సోమశిల నుంచి శ్రీశైలం వరకు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనసాగే ఏసీ లాంచి ప్రయాణంపై ఈ ఏడాది అటవీశాఖ ఆంక్షలు విధించింది. లాంచి ప్రయాణం చేసే పర్యాటకుల నుంచి తెలంగాణ టూరిజం కార్పొరేషన్ వారు వసూలు చేసే 4500 రూపాయలలో అటవీశాఖ కూడా ఒక్కొక్క టికెట్‌పై 30 శాతం షేర్ ఇవ్వాలని కోరుతున్నది. దీంతో ఇద్దరి మధ్య సమన్వయం లోపించడంతో పర్యాటకులకు లాంచీ ప్రయాణం అందుబాటులో లేకుండా పోయింది. సోమశిల కృష్ణానదికి ఆ వైపు సప్త నదుల సంగమేశ్వరాలయం ఒక వైపు ద్వాదశ జ్యోతిర్లింగాలు కలిగిన సోమేశ్వరాలయం ఉన్న ప్రసిద్ధిగాంచిన ప్రాంతంగా సోమశిల విరాజిల్లుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి 90 కోట్ల రూపాయలు వెచ్చించింది. అందులో 20.86 కోట్లతో సోమశిల గ్రామంలో కాటేజీలు, ఏసీ లాంచి హోటళ్లు ఏర్పాటు చేసింది. పర్యాటక శాఖ నేతృత్వంలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు సాగే లాంచి ప్రయాణం మరుపురాని అనుభూతి మార్గమధ్యలో అంకాలమ్మ కోట పక్కనే కృష్ణానది ఇరువైపులా ఎత్తైన కొండలు.. మధ్యలో వెలిసిన ద్వీపం.. అక్కడక్కడ జాలర్లు ఏర్పాటు చేసుకున్న నివాస గృహాలు పర్యాటకులకు ఎంతో ఆకర్షిస్తాయి.



సోమశిలలో కృష్ణానది

లాంచి ప్రయాణం ఇలా ...

సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచి ప్రయాణం కోసం ఆన్‌లైన్ ద్వారా 4500 రూపాయలు పెట్టి టికెట్ బుక్ చేసుకున్న పెద్దలకు.. 3600 రూపాయలు పెట్టి చిన్న పిల్లలకు టికెట్ బుక్ చేసుకున్న తరువాత సోమశిల కృష్ణానది నుంచి ఏసీ లాంచి ప్రయాణం ప్రారంభమవుతుంది. శ్రీశైలం వరకు సాగే లాంచి ప్రయాణంలో పర్యాటకులకు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ వారే మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారు. సాయంత్రం పాతాళ గంగ వద్ద రూప్ వే ద్వారా పైకి చేరిన తరువాత పర్యాటకులు అందరికీ విడిది గదులు కేటాయిస్తారు. మరుసటి రోజు తిరుగు ప్రయాణం చేసిన పర్యాటకులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించి సోమశిలకు చేరుస్తారు. కేవలం వన్‌వే అయితే పెద్దలకు 2499, పిల్లలకు రూ.1600 తీసుకొని అన్ని సదుపాయాలు కల్పిస్తారు.



సోమశిల కృష్ణానది ఒడ్డున నిలిచిన ఏసీ లాంచి

● ఇదిలా ఉండగా ఏసీ లాంచి కెపాసిటీ 120 మంది కాగా, 70 మంది పర్యాటకులు ఉంటే తప్పా లాంచి ప్రయాణం కృష్ణానదిలో సాగని పరిస్థితి ఉంది. కృష్ణానదిలో లాంచి పోయి తిరిగి వస్తే 1,70,000 ఖర్చు వస్తుందని టూరిజం శాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా, కృష్ణానదిలో లాంచి ప్రయాణంపై తెలంగాణ అటవీశాఖ, తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లను సమన్వయ పరిచి పర్యాటకులకు లాంచి ప్రయాణం అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం అనివార్యం కానుంది. ఈ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉండటంతో పర్యాటకులు ఈ ప్రాంతంలో మరింత టూరిజం అభివృద్ధి కోరుతున్నారు. త్వరలోనే లాంచి ప్రయాణం సాగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్తాం



సోమశిల కృష్ణానది నుంచి శ్రీశైలం వరకు లాంచి ప్రయాణం జరిగేలా పర్యాటకులకు లాంచి ప్రయాణం అందుబాటులో ఉండేలా మంత్రి జూపల్లి దృష్టికి తీసుకువెళ్తాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే సోమశిల కృష్ణానది ఒడ్డున ఉన్న లాంచిని పరిశీలించాం. ఉన్న సమస్యలను తెలుసుకున్నాం. త్వరలోనే మంత్రి సహకారంతో వాటన్నిటిని పరిష్కరించి పర్యాటకులకు లాంచి అందుబాటులోకి తెస్తాం.

- కల్వారాల నరసింహ, జిల్లా పర్యాటక శాఖ అధికారి

మిల్లర్ల మనోభావాలను దెబ్బ తీశారు



సమవేశంలో మాట్లాడుతున్న మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి

కొత్తకోట, ఆగస్టు 25 : బకాయిల పేరుతో అధికారులు ఆస్తులు జప్తు చేసి రాష్ట్రంలోని రైస్ మిల్లర్ల మనోభావలు దెబ్బ తీశారని రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలో మిల్లర్ల ఇంటిలోని సామగ్రిని అధికారులు జప్తు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులతో ఆదివారం కొత్తకోట మండల విలియంకొండ గ్రామ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ చట్టం ప్రకారంగా సెప్టెంబరు నెల 30వ తేదీ వరకు గడువు ఉండగా అధికారులు తొందర పాటు చర్యలు ఎందుకు తీసుకున్నరోనని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దురుసు తనంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని అన్నారు. ఊర్లో విలువలతో బతుకుతున్న మిల్లర్ల కుటుంబాల ఆస్తుల జప్తు సందర్భంగా అధికారులు మానవధృకృదంతో ఆలోచించక పోవడం దురదృష్టకరమన్నారు. అధికారం అనుభవిస్తూ కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చినా కోర్టు తీర్పు లేకుండా చర్యలు తీసుకున్నారా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 30వేల పైచిలుకు రైస్ మిల్లులు ఉన్నాయని, ఆ మిల్లులను చూసుకొని నాయకులు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇస్తున్నరన్నారు. అలాగే అధికారులు కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు మిల్లుకు పంపి చేతులు దులుపుకుంటున్నారు. కానీ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పత్తి మార్కెట్‌కు వచ్చినప్పుడు కాటన్ మిల్‌కు బకాయిలు చెల్లించినట్లుగా రైస్ మిల్లర్లకు చెల్లింపులో నిర్లక్ష్యం ఎందుకని నిలదీశారు. రైతుకు బాసటగా వ్యవసాయానికి అండగా ఉంటూ అన్నం పెడుతున్న మిల్లర్లను రైతులు, కూలీలు అండగా ఉండాలని కోరారు. బాధిత మిల్లర్లకు అసోసియేషన్ సభ్యులు మేమున్నామని ధైర్యం చెప్పారు. సభ్యులు నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోషియేషన్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి జగన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగుట్ట తండాలో ఎక్సైజ్ దాడులు

నారాయణపేట రూరల్, ఆగస్టు 25 : మండలంలోని నల్లగుట్ట తండాలో ఆదివారం ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్సు మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, బెల్లం పానకంను పారబోశారు. ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది డీటీఎఫ్ సీఐ కవిత, ఎస్‌ఐ గురువయ్య పాల్గొన్నారు.

వలస జిల్లాకే వలస

- మంత్రాలయం టు చిన్నచింతకుంట - పత్తి చేలల్లో పనులు చేస్తున్న కూలీలు



పర్థీపూర్ శివారులో పత్తిచేలల్లో దోకుతున్న మంత్రాలయం కూలీలు

చిన్నచింతకుంట, ఆగస్టు 25 : పాలామూరు జిల్లా వలసలకు పెట్టింది పేరు. దేశంలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా ఇక్కడి కూలీలు 'పాలమూరు లేబర్' కన్పించేవారు. పెద్దపెద్ద బిల్డింగ్‌లు, రోడ్డు పనులు ఇలా అనేక పనుల్లో పాలమూరు కూలీలు అత్యధికంగా పని చేసే వారు. ఎంతో మంది గుంపు మేస్త్రీల వెంట పూటడవక పొట్టకూటి కోసం వెళ్లేవారు. వలస జిల్లాకే ఇతర ప్రాం తాల నుంచి కూలీలు వలస వస్తున్నారు. కొన్నేళ్లుగా ఇలా గే సుదూర ప్రాంతాల నుంచి కూలీలు పొట్టచేత పట్టుకుని, పాలమూరు జిల్లాకు వస్తు న్నారు. తాజాగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని పర్థీపూర్, ఏదులాపూర్, బండ ర్‌పల్లి, ఉంద్యాల, దమగ్నాపూర్ గ్రామాలలోని శివారుల ప్రాంతాలతో పాటుగా ఇతర మండలాలకు ఎంతో మంది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి చిన్నచింతకుంట మండలంలోని పలు గ్రామాల్లో పత్తి చేలల్లో కలుపుతీసే పనులకు కూలీలుగా వచ్చారు. దాదాపు 500 మంది దాకా మంత్రాలయం కూలీలు వచ్చినట్లు పలువురు కూలీలు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. తమ ప్రాంతాల్లో వర్షాలు సరిగ్గా కురవకపోవటంతో తీవ్ర కరువు ప్రభావం కారణంగా వ్యవసాయ పొలాల్లో కూలీ ప నులు దొరకక, భార్యాభర్తలు, పిల్లాపాపలతో కలిసి, పొట్ట చేత పట్టుకుని, పత్తి చేలల్లో కూలి పనుల కోసం వచ్చి, పనులు చేస్తున్నామని వారు తెలిపారు. రోజు కూలీ రూ.400 ఇక్కడి రైతులు తమకు ఇస్తున్నారని, దాంతో తమకు కొంత బతుకుదెరువుకు ఆసరాగా ఉందని కూలీలు తెలిపారు. దాదాపు 20 రోజుల నుంచి ఈ ప్రాంతంలో కూలీ పనులు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అక్కడ ఉపాధి లేకనే ఇక్కడికి వచ్చాం



మంత్రాలయం ప్రాంతంలో మాకు ఉపాదీలేదు. అక్కడ కూలీ పనులు దొరకటంలేదు. భార్యాభర్తలం కలిసి ఇద్దరం ఇక్కడ పర్థీపూర్ గ్రామం శివారులోని పత్తి చేలల్లో కలుపు తీసేపనులు చేస్తున్నాం. ఇక్కడ మాకు ఒక్కొక్కరికీ రూ.400 ఇస్తున్నారు. కూలి డబ్బులతోనే మాకు బతుకు దెరువు లభిస్తున్నది.

- నారాయణమ్మ, చిన్నబోంపల్లి, మంత్రాలయం

ఇక్కడ బతుకుదెరువు ఉంది



మా ప్రాంతంలో అంతగా వర్షాలు కురవక, పనులు లేవు. పొట్టచేతబట్టుకుని, పిల్లా పాపలతో కలిసి ఇక్కడికి వచ్చాం. ఇక్కడ మాకు కూలీ పనులు బాగానే ఉన్నాయి. ఇంకా దాదాపు నెల రోజులపాటుగా కూలీ పనులున్నాయి. తరువార కూడా పత్తి ఏరేందుకు మా వాళ్లు చాలా మంది వస్తారు.

- లక్ష్మయ్య, మంత్రాలయం

బాలుడిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

- అక్కడికక్కడే మృతి



మహేష్ (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 25 : తోటి పిల్లలతో కలిసి బంతితో ఆడుకుంటున్న బాలుడిపై విద్యుత్ స్తంభం విరిగి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో ఆదివారం జరిగింది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగమేశ్వరకాలనీలోని ఓ వీధిలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఆదివారం కాలనీ సమీపంలోని చెట్ల కొమ్మలను కొట్టేయిస్తుండగా, తమ వీధిలోనూ చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు లైన్‌మెన్ రామదాసును కోరారు. దీంతో ఆ వీధికి విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయించాలని అర్టిజన్ చంద్రుడుకు సూచించాడు. ఆ తర్వాత సిబ్బందితో చెట్ల కొమ్మలను కొట్టించాల్సి ఉండగా, కాలనీకి చెందిన యువకులతో కొమ్మలను కొట్టించడం మొదలు పెట్టారు. అక్కడికి కొద్ది దూరంలో కాలనీకి చెందిన మద్దిలేటి, మానస దంపతుల కుమారుడు మహేశ్, మరికొందరు పిల్లలతో కలిసి బంతితో ఆడుకుంటున్నాడు.



విరిగిపడిన విద్యుత్ స్తంభం



రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

అదే సమయంలో నరికిన వేప చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. ఆ బరువుకు సపోర్ట్ పోల్ లేని విద్యుత్ స్తంభం విరిగి మహేశ్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. క్షణకాలంలో జరిగిన ఈ సంఘటన కాలనీ వాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. బాలుడి తండ్రి మద్దిలేటి ఊరురా తిరుగుతూ ఎల్లిపాయలు, కారం తదితర నిత్యవసర సరుకులు విక్రయిస్తుండగా, తల్లి చిన్న కిరాణం నిర్వహిస్తోంది. అప్పటి వరకు సంతోషంతో ఆడుకుంటున్న కుమారుడు, స్తంభం మీద పడి మృతి చెందడంతో మానస కన్నీరు మున్నీరుగా విలపించింది. సంఘటనపై బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ శరత్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. చెట్ల కొమ్మలను కొట్టే సమయంలో అర్టిజన్‌ను నియమించామని, మరో చోట పని పడటంతో అతడు వెళ్లిపోయాడని ఆయన తెలిపారు. ఆ సమయంలో కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో స్తంభం విరిగి పడిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని ఏడీఏ చిన్నముగ్బుల్‌బాషా తెలిపారు. తమ శాఖ నుంచి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, తగిన పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జడ్చర్ల, ఆగస్టు 25 : జడ్చర్ల మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన పోలే వెంకటయ్య(42) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని వెంకటయ్య భార్య పోలే శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ నెల 23న బూర్గుపల్లి గ్రామానికి చెందిన కావలి యాదయ్య పొలంలో పనుల నిమిత్తం కూలీ పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాలలో వెతికారు. ఈ నెల 24న సాయంత్రం 6గంటల ప్రాంతంలో కావలి యాదయ్య పొలంలోని వరి కరిగెటలో అదే గ్రామానికి చెందిన నర్సిములు, ప్రవీణ్‌లకు బోర్లా పడి ఉన్న వెంకటయ్య కనిపించాడు. వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త వెంకటయ్య మృతిపై అనుమానం ఉందని శాంతమ్మ తన ఫిర్యాదులో పేర్కొందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జడ్చర్ల డెంగీ కేసులు

జడ్చర్ల, ఆగస్టు 25 : జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు డెంగీతో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతుండగా, ప్రైవేట్ ఆసుపత్రిలో మరికొంత మంది చికిత్స పొందుతున్నట్లుగా తెలిసింది. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు డెంగీతో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళ తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్వీపి నగర్, శివాజీనగర్ ప్రాంతాలకు చెందిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల పట్టణంలో దోమల బెడద అధికమైందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

తెలకపల్లి, ఆగస్టు 25 : కమ్మారెడ్డిపల్లిలో వివాహిత అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ నరేష్ కథనం ప్రకారం... కమ్మారెడ్డిపల్లికి చెందిన ఆవుల మొగులాయి అనే అతను తరచూ తాగి మద్యం మత్తులో భార్యతో గొడవ పడి కొట్టేవాడు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా మారలేదు. ఈ నెల 23న అదేవిధంగా తాగి భార్యను కొట్టిండు. ఈ బాధలను భరించలేని ఆమె ఆ రోజు రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. వారికి ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. స్వప్న తండ్రి గుంటి శాంతయ్య ఫిర్యాదు మేరకు తెలకపల్లి ఎస్‌ఐ నరేష్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

- పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఏనుగొండ (మెట్టుగడ్డ), ఆగస్టు 25 : పట్టణంలోని ఏనుగొండ రెవెన్యూ వార్డులో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏనుగొండలోని ఎస్సీ కాలనీలో కొత్తగా పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మొదటి రోజు వేదపండితుల మధ్య యాగం, హోమం జరిపించారు. అనంతరం రెండో రోజు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. మూడోరోజు బోనాల జాతర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. వేదపండితులు ప్రత్యేకంగా పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో బోనాలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నాయి. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రామ, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

నేడు గోకులాష్టమి

- ఉత్సాహంగా ఉట్లు కొట్టేందుకు ఏర్పాట్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 24 : గోకులాష్టమి వేడుకలను పాలమూరులో ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని పలు దేవాలయాలలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించే భక్తులు సాయంత్రం తరువాత ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలలో యువత పెద్దసంఖ్యలో పాల్గొననుండగా భక్తులు, ప్రజలు ఉట్ల కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీసంఖ్యలో హాజరవుతారు. జిల్లాలోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను పెద్దఎత్తున నిర్వహిస్తారు. గ్రామాలలోని ఆయా ఆలయాల దగ్గర అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాలమూరు పట్టణంలోని పద్మావతికాలనీ కృష్ణకమాన్ దగ్గర ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. ఇక గోకులాష్టమి సందర్భంగా చిన్న పిల్లలను కృష్ణుడు,గోపిక వేషధారణలతో ముస్తాబుచేసి తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. అబ్బాయిలను కృష్ణుడుగా, అమ్మాయిలను గోపికలుగా తయారు చేస్తారు. మరికొందరు అబ్బాయిలను గోపికగా, అమ్మాయిలను కృష్ణుడిగా కూడా తయారుచేసి మురిసిపోతుంటారు. పాఠశాలల్లోనూ వేడుకలు నిర్వహిస్తారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ



పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న లయన్ కె. ప్రసాద్

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఆగస్టు 25 : మహబూబ్ నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ అధ్యక్షుడు లయన్ కె. ప్రసాద్, కె. శ్రీహరి మాతృమూర్తి కె. సునందమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం ద్వారాకామయి బాబా మందిరం వద్ద పేదలకు పులిహోర ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పి. సుదర్శన్ యాదవ్, బుచ్చి బాబు, శ్రీ హరి, నాగరాజు, రుద్రోజీ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వచ్చే నెల 1న సభ

- హాజరుకానున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 25 : వక్ఫ్ చట్టంలో సవరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న జిల్లా కేంద్రంలో షాలిమార్ ఫంక్షన్‌హాల్ సభ నిర్వహిస్తున్నట్లు మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, ఎంఐఎం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జాబేర్‌బిన్ సయీద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హాదీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 10 గంటలకు సభ ఉంటుందని, ముఖ్య వక్తలుగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌ఒవైసీ, ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మాని హాజరుకానున్నట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు చట్టంలో అధికారాలను హరిస్తూ, వక్ఫ్ ఆస్తులపై పట్టు సాధించాలనే ఉద్దేశంతో సవరణ తెచ్చిందని విమర్శించారు. ప్రతిపక్ష సెక్యూలర్ పార్టీలు, ఇండియా కూటమి ఈ బిల్లుపై పార్లమెంట్‌లో వ్యతిరేకించాయన్నారు. బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కన్వీనర్ తఖీహుస్సేన్, కో కన్వీనర్ హాఫీజ్ ఇద్రీస్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సాదుతుల్లా హుస్సేనీ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి

- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్



జడ్చర్ల : గురుకుల పాఠశాల విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

జడ్చర్ల, ఆగస్టు 25 : గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ కోరారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ఆలూరుకు వెళ్లే దారిలోని నవాబ్‌పేట మండలానికి మంజూరైన జ్యోతిబాఫూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం బీసీ సేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఒకే హాల్‌లో హస్టల్‌తో పాటు డైనింగ్ హాల్, రెండు తరగతులను నిర్వహిస్తున్నట్లు గమనించారు. కిటికీలకు రెక్కలు బిగించకపోవడం, ఫ్యాన్‌లు పని చేయకపోవడంతో విద్యార్థులు దోమల బెడదతో ఇబ్బం దులకు గురవుతున్నారని కృష్ణ యాదవ్ అన్నారు. వర్షం వస్తే భవనం అంతా కురుస్తుందని, విద్యార్థులు నిద్రకు సైతం దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లకు డోర్లు లేకపోవడం, లైట్లు, నీళ్ల సౌకర్యం లేవని, దీంతో విద్యార్థులంతా బహిర్భూమికి వెళ్తున్నారని ఆరోపించారు. వెంటనే విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, భీంరాజ్, శివశంకర్, రాములు, వెంకటేశ్, గోపాల్, శివరాములు తదితరులున్నారు.

ట్రాఫిక్ సీఐకి ఘన సన్మానం



సీఐ భగవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డిని కమిటీ జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌జీ, నాయకులు రాఘవేందర్‌గౌడ్, మల్లికార్జున్, భానుప్రతాప్, అన్వార్ హుస్సేన్స్ ఆయనను పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ప్రైవేట్ పాఠశాల బస్సుల తదితర సమస్యలు వివరించారు.

వినాయక చవితిని వైభవంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 25 : వినాయకచవితి ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గణేష్ భవన్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవ సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధార్మిక కార్యక్రమాల్లో రాజకీయం ప్రమేయం ఉండరాదని, ప్రజలకు ఇబ్బందులు కల్పించకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం డిసెంబరు మూడు నాడే మీకు వచ్చిందని, గ్రూపులు, వర్గాలు చేయరాదని ఆయన సూచించారు. ఐకమత్యంతో సామరస్యంగా ఇబ్బందులు తలెత్తకుండా పండుగ జరుపుకోవాలని తెలిపారు. గణేష్ మండపాలు పవిత్రంగా ఉండాలని అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా మంచి సంకల్పంతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, మద్ది యాదిరెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, అబ్దుల్ హక్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి : ఎం.పి. డికె. అరుణ

మహబూబ్‌నగర్ టౌన్ : గణేష్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఎం.పీ. డికె. అరుణ కోరారు. ఆదివారం గణేష్ భవన్‌లో వినాయక ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గణేష్ పర్వదినాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఐక్యమత్యంతో ఎవ్వరికి ఇబ్బందులు కల్గకుండా నిష్టతో పర్వదినాన్ని జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

దశాబ్ద కాలంలో తెలంగాణ విధ్వంసం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : దశాబ్ద కాలంలో తెలంగాణ విధ్వంసం జరిగిందని, కనీసం ఎవరినీ పట్టించుకోలేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో వ్యాయమ ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందిన 59 మందికి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోషియేషన్ (పేటాటీఎస్) ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు తెలంగాణ ఉద్యమ సమయం అందరిలోను స్ఫూర్తిని నింపి ముందుడి నడిపించిన వారిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రాష్ట్రం సహకారం అయిన తర్వాత గత ప్రభుత్వం విద్య వైద్యరంగాన్ని పూర్తిగా పట్టించుకోలేదన్నారు . ఆంధ్ర కాంట్రాక్టర్లకే నిధులు మళ్లించారన్నారు. గత కొన్నేళ్లుగా పీఈటీలకు పదోన్నతులు లేక పీఈటీలుగానే ఉండిపోయారన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపాలన్నారు. గ్రామీణ క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. అనంతరం పదోన్నతి పొందిన వ్యాయామ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఈవో రవీందర్, పేటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, వడెన్న, రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, కృష్ణమూర్తిగౌడ్, వేణుగోపాల్, ఆరేళ్ల రమేష్, రాజవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రావు, పీర్ మహ్మద్ సాదిక్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నాం

ప్రతీ బూత్‌లో 75 శాతం సభ్యత్వ నమోదు కావాలి

- స్థానిక సంస్థ ఎన్నికల్లో అన్నీ సీట్లను బీజేపీయే కైవసం చేసుకోవాలి

- కార్యకర్తల సమావేశంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఆగస్టు 25 : ప్రతీ బూత్‌లో 75 శాతానికి తగ్గకుండా బీజేపీ సభ్యత్వ నమోదు జరగాలని పాలమూరు నియోజకవర్గ ఎంపీ సభ్యురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీకే అరుణ, జిల్లా ఇన్‌చార్జి నల్లగొండ చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి బూత్ స్థాయిలో 75 శాతానికి తగ్గకుండా సభ్యత్వ నమోదు జరిగితేనే పార్టీ బలపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నీ సీట్లను కైవసం చేసుకుంటుందని వివరించారు. బాగా పని చేసిన కార్యకర్తలను పార్టీ గుర్తించి, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. బూత్ అధ్యక్షుడు కావాలన్న ఆ బూత్‌లో ఎక్కువ మందితో సభ్యత్వం చేయించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె. రాములు, బురుజు సుధాకర్ రెడ్డి, దేవరకద్ర కొండ ప్రశాంత్ రెడ్డి, శేరి పాండురంగా రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, జయశ్రీ, పద్మవేణి, సాహితీరెడ్డి, నిరంజనమ్మ, యాదమ్మ, మెట్టుకాడి శ్రీనివాసులు, కొత్తకోట కిరణ్ కుమార్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య చెన్న వీరయ్య, పడాకుల సత్యం, నాగేశ్వర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, మదిగట్ల రవీందర్ రెడ్డి, రాపోతుల శ్రీనివాస్ గౌడ్, రమేశ్, రాజేష్ పాల్గొన్నారు.

● అంతకు ముందు కొత్త గంజిలో బీజేపీ సీనియర్ నాయకుడు, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబ సభ్యులను డీకే అరుణ పరామర్శించారు. అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి, మోర్చా అధ్యక్షుడు యాదయ్య, నాయకులు హరికృష్ణ, సంపత్ కుమార్, విజయ శంకర్, శ్రీకాంత్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.

రంగనాయకస్వామి గుట్ట అభివృద్ధికి చేయూతనివ్వాలి

జడ్చర్ల : జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు రంగనాయకస్వామి గుట్ట అభివృద్ధికి చేయూత అందించాలంటూ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు జడ్చర్ల బిజెపి నాయకులు వినతిపత్రం అందచేశారు. మహబూబ్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా గుట్టపై ఉన్న శ్రీరంగనాయక స్వామి దేవాలయం అభివృద్ధి చేయడంతో పాటు పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర, కేంద్ర నిధులను మంజూరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు కొంగళి శ్రీకాంత్, సామల నర్సిములు, ముచ్చర్ల కృష్ణయ్య, వెంకటేశ్, రమేశ్, మల్లేష్, నరేశ్, కిషన్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

వ్యాపారం కోసం దివ్యాంగులకు ఆర్థిక సహాయం

హన్వాడ, ఆగస్టు 25 : నిరుద్యోగ దివ్యాంగులు వ్యాపారం చేసుకునేందుకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తుందని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మంగళి వీరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చిన్నచిన్న వ్యాపారం చేస్తున్న వారు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 10 వేల నుంచి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం ఇస్తుందని, దీన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న ఎస్‌జీఎఫ్ సమావేశం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 : పాఠశాల క్రీడా సమాఖ్య సమావేశం ఈ నెల 27 ఆర్‌వీఎం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 సంవత్సరానికి సంబంధించి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పని చేస్తూ పీఈటీలు, పీడీలు, హాజరుకావాలని కోరారు. సీనియారిటీ ప్రకారం సెక్రటరీ ఎన్నిక ఉంటుందని తెలిపారు.

బస్సు ఆగిపోయి ప్రయాణికుల అవస్థ

గండీడ్, ఆగస్టు 25 : శనివారం రాత్రి మండల పరిధిలోని జానంపల్లి గేటు దగ్గర తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇంజన్‌లో సమస్యతో మధ్యలోనే ఆగిపోయింది. డ్రైవర్ జాగ్రత్తతో బస్సును సర్వీస్ రోడ్డుకు మళ్లించి ప్రమాదం తప్పించాడు. ప్రయాణికులను వేరే బస్సు ఎక్కించాడు. కండక్టర్ వేరే బస్సుకు వెళ్లి డిపోకు కలెక్షన్ అందించాడు. దీంతో డ్రైవర్ కండక్టర్లు ఇబ్బందిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం సమయానికి రిపేరు చేసి బస్సును తీసుకువెళ్లారని గ్రామస్థులు తెలిపారు. ఓవర్ లోడ్ తోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని సిబ్బంది తెలిపారు.

ఏకీకృత పెన్షన్ మరో మోసం : యూటీఎఫ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : కేంద్ర ప్రభుత్వం చెప్పిన ఏకీకృత పెన్షన్ పేరిట ప్రకటించిన పెన్షన్ విధానం మసిపూసి మారేడుకాయ చేయడమేనని, దానిని అంగీకరించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి మోసం చేయడమేనని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్‌లు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త పేరుతో ఇచ్చిన ప్రకటనపై వారు ఈ ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. 25 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు పేర్కొనడం దగా అని పేర్కొన్నారు. సెప్టెంబరు 1న నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తామన్నారు.

కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : యునైటెడ్ పెన్షన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కేంద్రం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణసెట్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం. చంద్రకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .ఉద్యోగికి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రతతో కూడిన 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో 1989-1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా 1990లో విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులు కృష్ణయ్య, బాల్‌రెడ్డి, సిద్దన్న, రాఘవేంద్రచారి, సువర్ణలత, భానుమూర్తి, పీఈటీ హమీద్‌లను వారు ఘనంగా సన్మానించారు. అప్పట్లో ఉపాధ్యాయులు బోధించిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఫర్నిచర్ అందజేశారు. కార్యక్రమంలో చంద్రమోహన్ బొల్లం సునీల్ కుమార్, దత్తేంద్ర, రాఘవాచారి, జ్యోతి, రాధారాణి, గీతాదేవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1న కె.కె. స్మారక సభ

పాలమూరు, ఆగస్టు 25 : కె.కనకాచారి స్మారకసభను వచ్చేనెల 1న జిల్లా కేంద్రంలోని అరుంధతీ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కె.కె. మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు కె.వామన్‌కుమార్, కె.భీమయ్య, డి.నరసయ్య, యం.రాఘవాచారిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా జహీరా, ఖలీదా పర్వీన్, ప్రొ.జి.హరగోపాల్, ఎస్.వేణుగోపాల్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమసమాజ స్వప్నాలలో మన సామాజిక వృత్తిపర ఉద్యమ ఆచరణను ప్రభావితం చేసిన మనిషి కనకాచారి అని అన్నారు. అభ్యుదయ వాదులు, ప్రజాసంఘాల నాయకులు సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కరాటే విద్యార్థికి అభినందన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 : ఇటీవలే జరిగిన జాతీయ స్థాయి కరాటే టోర్నీలో జిల్లా కేంద్రంలోని హనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థి శివశంకర్ బంగారు పతకం సాధించాడు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎంపీ డీకే అరుణ ఆ విద్యార్థిని అభినందించారు. మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, హనుమాన్ కరాటే అసోషియేషన్ ఫౌండర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 22 అడుగుల నీటి నిల్వ

దేవరకద్ర, ఆగస్టు 25 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రం వరకు 22 అడుగుల వద్ద నీటి నిల్వ ఉంది. నెల రోజుల కిందట ప్రాజెక్టులో 17.6 అడుగుల వద్ద నీటి నిల్వ ఉండగా కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని వదిలారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం అడుగున్నర తగ్గింది. 20 రోజుల నుంచి జూరాల ప్రాజెక్టు నీటిని తీలేరు పంపుహౌస్ నుంచి రెండు పంపుల రన్ చేసి కోయిల్‌సాగర్‌కు అందిస్తున్నారు. ప్రాజెక్టులోకి వస్తున్న నీటితో సమానంగా కాల్వల ద్వారా నీటిని వదలడంతో జూరాల నీరు రావడంతో కొద్దిగా నీటిమట్టం పెరుగుతోంది. జూరాలకు ఇన్‌ఫ్లో ఉన్నన్ని రోజులు కోయిల్‌సాగర్‌కు నిరంతరం నీటిని అందించే అవకాశం ఉంది. అలాగే కుడి, కాల్వ ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. ఎడమ కాల్వను రెండు రోజుల క్రితం నిలిపివేశారు. మరో 10.5 అడుగులు అయితే పూర్తి స్థాయిలో నిండుతుందన్నారు.

కొనసాగుతున్న అఖండ భజన

దేవరకద్ర, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా అఖండ దీపారాధన, భజన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతీ రోజు ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అఖండ దీపారాధనతో పాటు సాయంత్రం భజన మండలి భక్తులు 41 రోజుల పాటు భజన చేస్తుంటారు. ప్రతీ సోమవారం ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తారు.

వేద విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించాలి

- డీఈవో రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 : విద్యార్థులకు వేద విజ్ఞానాన్ని బోధించాలని డీఈవో రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్యజమాజ మందిరంలో నిర్వహించిన శ్రావణవేద సప్తాహము పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేద విజ్ఞానాన్ని ప్రతీ ఒక్కరికి యజ్ఞ కార్యక్రమాల ద్వారా అందరికి అందించాలన్నారు. పూర్వం విద్యార్థులకు సంస్కృత విద్యను నేర్పించేవారన్నారు. అనంతరం విద్యార్థులు గాయత్రి మంత్రం పఠించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రధాన్ డాక్టర్ భరద్వాజ్ నారాయణ్, గౌర వాధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రావు, విఠల్‌రావు, శివకుమార్‌సింగ్, కృష్ణారెడ్డి, ఆలురి గంగయ్య, కిషన్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్‌కు ఘన నివాళి



జడ్చర్లలో బీపీ మండల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 25 : బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం జడ్చర్ల పట్టణంలో బీసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాదిమి శివకుమార్, బాదేపల్లి మాజీ సర్పంచ్ రేణుక, బీసీ సేన రాష్ట్ర అధ్య క్షుడు కృష్ణయాదవ్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీపీ మం డల్ నివేదిక ద్వారానే సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన 3743 కులా లను ఏకం చేసి ఉద్యోగ, ఉన్నత విద్యలో 27శాతం రిజర్వేషన్‌లు రావడానికి కారణమని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అశోక్ కుమార్, కోడ్గల్ యాదయ్య, అయ్యన్న, ప్రణీల్‌చందర్, శ్రీకాంత్, శశికిరణ్, జంగయ్య, దగ్గుల బాలరాజు, పరమటయ్య, భాగి కృష్ణయాదవ్, రాఘవేందర్, నిరంజన్, నర్సిములు పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఆదివారం సామాజిక న్యాయ పరిరక్షకుడు, బీసీ రిజర్వేషన్ల ప్రదాత, మండల్ నివేదిక రూపశిల్పి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, యాదయ్య, ప్రకాశ్, యాదగిరి, బుగ్గయ్య, శ్రీశైలం, సాయి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

29న మునిసిపల్ కార్యాలయం ముట్టడి

- మునిసిపల్ ఎంప్లాయిస్ నాయకులు



జడ్చర్లలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల, ఆగస్టు 25 : జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 29న జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలుగు సత్తయ్య, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ హెచ్చరించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట వెళ్లే దారిలోని చౌరస్తా వద్ద ఆది వారం మునిసిపల్ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ కార్మికులు 21 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడ్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా, బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళ కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్‌ను తక్షణమే బదిలీ చేయాలని, ఆయనపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, కేశవులు, కృష్ణ, సాగర్, నర్సిములు, రమేశ్, యాదయ్య, ఆంజనేయులు, విజయ్, వినోద్, అంజమ్మ, యాదమ్మ, స్వరూప, దేవమ్మ, లక్ష్మమ్మ, శివ, భీమమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

పాలమూరు, ఆగస్టు 25 : జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్చర్ల మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపట్టిన ఆందోళన 21వ రోజుకు చేరుకుందన్నారు. కమిషనర్ పరిధిలోని సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్మిక సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటేశంను ఉద్యోగం నుంచి తొలగించానని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అసత్య ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు ఆది విష్ణు, శ్రీనివాసులు, భరత్, ప్రశాంత్, సత్తయ్య, భానుప్రసాద్ పాల్గొన్నారు.